ప్రజాజ్యోతి
గురువారం । 25 । ఏప్రిల్ । 2024
ఖమ్మం

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని సత్కరించిన

# పోలీస్ కమిషనర్ మరియు జిల్లా కలెక్టర్



ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి:

బదిలీపై వెళుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఎస్. జగ్జీవన్ కుమార్ ని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లు బుధవారం జిల్లా కోర్టు లోని ప్రధాన న్యాయమూర్తి ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాకు ప్రధాన న్యాయమూర్తి అందించిన సేవలను కొనియాడుతూ, ఆయనను ఘనంగా సత్కరించారు.

# ఖమ్మంలో బిఆర్ఎస్ పార్లమెంటరీ ముఖ్య నాయకుల సమావేశం

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న హరీష్ రావు

**-ఖమ్మం ప్రజలు త్రాగు సాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు..**

**-కాంగ్రెస్ అబద్ధపు హామీలను ప్రజలు నమ్మొద్దు.. ఎంపీ వద్దిరాజు.**

**-తెలంగాణకు బిఆర్ఎస్ పార్టీ శ్రీరామరక్ష .. మాజీ మంత్రి పువ్వాడ.**

**-దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్ గా నిలిపిన వ్యక్తి కెసిఆర్ .. నామ నాగేశ్వరరావు**




ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 24 ప్రజాజ్యోతి

ఖమ్మం బి.ఆర్.ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వర రావు నామినేషన్ అనంతరం సీక్వెల్ ఫంక్షన్ హాల్ నందు జరిగిన పార్లమెంటరీ ముఖ్య నాయకుల సమావేశంలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ 4 నెలల కాంగ్రెస్ పాలనలో ముఠా రాజకీయాలు, తిట్లు, ఓట్లు జరుగుతున్నాయి. ఖమ్మం ప్రజలు తాగునీరు రాక, రైతులు సాగు నీరు రాక ఇబ్బంది పడుతుంటే వీరు మాత్రం టికెట్ల కోసం ఢిల్లీ కి వెళ్తున్నారు. ఖమ్మం జిల్లాలో నీటి ఎద్దడి రావద్దని ఖమ్మంకు సీతారామ ప్రాజెక్ట్ కు నిధులు కేటాయించాం. రేపటికి నామినేషన్లు పూర్తి అవుతాయి, ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఎన్నుకోలేదు. ఎవరికి ఇవ్వాలో వారిలో వారే కొట్టుకుంటున్నారు. ఇలాంటివి ఇంకా ఎన్ని చూడాలో.కాంగ్రెస్ అభ్యర్థిగా పూటకు ఒక పేరు వస్తుంది, ఈ జిల్లా వారే కాకుండా బయట వారిని కూడా తీసుకుని వస్తా అంటున్నారు.కాంగ్రెస్ వస్తె మార్పు వస్తుందని అనుకుంటే ఈ జిల్లాలో ముగ్గురికి మాత్రమే నౌకరీ వచ్చింది.కాంగ్రెస్ పార్టీ కళ్ళు నెత్తికి ఎక్కి మాట్లాడుతున్నారు, అది దిగాలి అంటే నామా నాగేశ్వరరావును ఎంపీగా గెలిపించాలని.కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ మీద మొదటి సంతకం అన్నారు.. విస్మరించారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీనీ మరిచి తిరిగి ఓట్లు అడిగేందుకు ప్రజల మధ్యకు వస్తున్నారు..కాంగ్రెస్ పాలనలో బస్సు మినహా అంతా తుస్సే.. ఏమైంది మీ హామీలు.. ఏమైంది మ్యానిఫెస్టోలో ఇచ్చిన పథకాలు.. అసలు వస్తాయా అన్న సందేహం ప్రజల్లో వచ్చేసింది.కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో తుక్కు తుక్కుగా ఓడిస్తారని దేవుడి మీద ప్రమాణాలు చేస్తున్నారు.అసెంబ్లీ ఎన్నికల సమయంలో బాండు పేపర్ లు తీసుకు వస్తె వాటి మీద నమ్మకం ఉండే, కాంగ్రెస్ కారణంగా వాటి మీద నమ్మకం పోయే.రేవంత్ రెడ్డి.. ఆగస్టు 16 తేదీ లోపు రుణమాఫీ చేస్తావా, చేయవా ప్రజలకు తెలియజేయాలి, చేయకపోతే

మిగతా 2లో

# ఖమ్మం పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి

## -ఎట్టకేలకు ఉత్కంఠకు తెరదించిన కాంగ్రెస్ అధిష్టానం

ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 24, ప్రజా జ్యోతి:

ఖమ్మం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ టికెట్ తెలంగాణ రాష్ట్రంలోనే హాట్ టాపిక్ గా మారింది అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ సీట్ కొరకు ఖమ్మం లోని ముగ్గురు ముఖ్య నేతలు తమవారికి సీటు ఇప్పించడంలో పోటీ పడడం ఇంకా కొందరు సీనియర్ నాయకులు కూడా పోటీకి రావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎవరికి టికెట్ నిర్ణయించాలో అనే విషయాలపై మల్లగుల్లాలు పడుతున్న సందర్భంలో ఖమ్మం పార్లమెంట్ స్థానానికి ఆశావహులు రాయల నాగేశ్వరరావు, పొట్ల నాగేశ్వరరావు ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు. ఇది అలా ఉండగా ఎట్టకేలకు కాంగ్రెస్ అధిష్టానం చిక్కుముడిలా మారిన ఖమ్మం ఎంపీ సీటు కు రామ సహాయం రఘురాంరెడ్డిని ఖరారు చేసింది. కాగా రామ సహాయం రఘురాం రెడ్డి నిన్ననే ఖమ్మం రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ వి పి గౌతం కు నామినేషన్ పత్రాలు అందజేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.



# ఖమ్మం కు వచ్చిన ఎన్నికల పరిశీలకులు



ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 24, ప్రజా జ్యోతి:

లోకసభ సాధారణ ఎన్నికలు-2024 పురస్కరించుకుని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు డా. సంజయ్ గేంద్రాజ్ కోల్టే, పోలీస్ పరిశీలకులు చరణ్ జీత్ సింగ్ లు బుధవారం జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లు ఎన్ఎస్పీ గెస్ట్ హౌజ్ లో ఎన్నికల పరిశీలకులను మర్యాదపూర్వకంగా కలిసి, పూలమొక్కలు ఇచ్చి, స్వాగతం పలికారు.

# ఖమ్మంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ ముఖ్య నాయకుల సమావేశం

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న హరీష్ రావు



(మొదటి పేజీ తరువాయి)

నువ్వు రాజీనామా చేయాలి. ఏదో ఒకటి చేయి.

కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ప్రజలు ఓటు వేయరు. అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీ వృద్ధులకు పించన్ రూ.4 వేలు వేస్తా అని ఇవ్వలేదు. ప్రజలకు బాకీ ఉన్నారు. రాష్ట్రంలో మహిళలందరికీ రూ.2500 ఇస్తా అన్నావ్ ఇవ్వలేదు, రాష్ట్రంలో మహిళలకు కాంగ్రెస్ పార్టీ రూ.10 వేలు బాకీ పడింది.కాంగ్రెస్ తీరు ఓడ దాటే దాక ఓడ మల్లన్న.. ఓడ దాటాక బోడ మల్లన్న అన్నట్లు ఉంది.ప్రజలు మోసపోతారు అని రేవంత్ రెడ్డి బహిరంగంగా ఒక ఛానల్ ఇంటర్వ్యూ లో చెప్పారు. కానీ ప్రజలు ప్రతిసారి అలా మోసపోరు రేవంత్ రెడ్డి అది గుర్తు పెట్టుకోండి.ఖమ్మంలో తాగునీరు బురద నీళ్ల వలే వస్తున్నాయి, అంటే కాంగ్రెస్ పరిశుద్ధ నీటిని అందించలేని స్థితిలో కాంగ్రెస్ ఉంది. కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో బుద్ది చెప్పాలి. ప్రజలు కేసీఆర్ వైపు, మీ వైపు చూస్తున్నారు, ప్రజలకు కాంగ్రెస్ అబద్ధాలు, మోసాలను చెప్పండి.కాంగ్రెస్ చెప్పిన 6 గ్యారంటిలను అమలు చేయలేదు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు చిత్తు చిత్తుగా ఒడిస్తారు.కాంగ్రెస్ పార్టీ అహంకారాన్ని దించాలంటే వారిని ఓడించాల్సిన అవసరం ఉంది.కాంగ్రెస్ పార్టీని అసెంబ్లీలో మెడలు వంచి గ్యారెంటీలను అమలు చేసేలా చేస్తాం.

కాంగ్రెస్ పార్టీ ఇక్కడ ఓడినా ప్రభుత్వమేమీ పడిపోదు, ఇక్కడ కాంగ్రెస్ పార్టీ గెలిచినా కేంద్రంలో అధికారంలోకి వచ్చేది లేదు.కాంగ్రెస్ పార్టీవి అన్ని బోగస్ మాటలే. గ్యారెంటీ లను అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీకి 100 రోజులు పూర్తి సమయం దాటిపోయిన వాటిని అమలు చేయలేదు. చేయలేదు కూడా. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గడప గడపకు వెళ్ళండి మిమ్మల్ని ప్రజలు ఆదరిస్తారు.

ఈ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయి అప్పటికి మిమ్మల్ని గెలిపించేందుకు బీఆర్ఎస్ పార్టీ సహకారం అందిస్తుంది. సీపీఎం, సీపీఐ నాయకులు రేవంత్ రెడ్డి మొన్న కేరళ వెళ్లి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ని మోడీ ఏజెంట్ అన్నా, మీరెందుకు కాంగ్రెస్ పార్టీకి ఊడిగం చేస్తున్నారో అర్థం కాల్లేదు.రాహుల్ గాంధీ కాంగ్రెస్ వేరు, రేవంత్ రెడ్డి కాంగ్రెస్ వేరు.. రాహుల్ గాంధీ అదాని ని చోర్ అంటారు, రేవంత్ రెడ్డి అదాని మంచివాడు అంటారు.రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీని భాయ్ అంటారు, నరేంద్ర మోడీని బడే భాయ్ అంటారు. అంటే మళ్ళీ తిరిగి మోడీ ప్రధాని కావాలని రేవంత్‌రెడ్డి కోరుకుంటున్నారా..?రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ మంత్రి కూడ లేరు, టీడీపి, బీఆర్ఎస్ హయాంలో ఎంతో మంది మైనార్టీ మంత్రులు ఉన్నారు.రేవంత్ రెడ్డి నరేంద్ర మోడీకి భయపడి ఒక్క మైనార్టీ మంత్రికి అవకాశం ఇవ్వలేదు. ముస్లిం సోదరులు గమనించాలి.ఈ ఎన్నికల్లో నామా నాగేశ్వరరావుకు ఓట్ వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నా.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత సుమారు లక్ష పెళ్ళిళ్ళు అయ్యాయి, రాష్ట్రాల్లో ఉన్న వారందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష తులాల బంగారం బాకీ పడింది.4 నెలలకే కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలను ఇంతలా ఇబ్బందులకు గురి చేస్తే, ఇంకా 4 ఏళ్లు ప్రజలను ఇంకా ఎంత ఇబ్బందులకు గురి చేస్తారో చూడాలి. ఖమ్మం జిల్లాలో సగం మంది పంటలు వేయలే, వేసిన సగం మంది పంటలు ఎండిపోయాయి.ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో నిలం తుఫాన్ వస్తే వరంగల్ కు ఇచ్చి ఖమ్మం రైతులను విస్మరిస్తే బీఆర్ఎస్ పార్టీ ఉద్యమం చేసి రైతులకు నష్టపరిహారం అందించాం. దాదాపు రూ.500 కోట్లు పరిహారం అందించింది %ఎతీం% ప్రభుత్వం.లంబాడీల కు, గిరిజనులకు కేసీఆర్ ప్రభుత్వంలో పోడు భూములు ఇచ్చాం, సత్యవతి రాథోడ్ కు మంత్రి పదవి ఇచ్చారు, మి క్యాబినెట్ లో ఏ ఒక్క లంబాడి మంత్రి అయినా ఉన్నారా..? కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క ఎంపీ టికెట్ కూడా కేటాయించలేదు. మాదిగల ఆత్మగౌరవం దెబ్బతిన్నది, మాదిగల ఉసురు కాంగ్రెస్ పార్టీకి తగులుతుందని మోత్కుపల్లి నర్సింహులు స్వయంగా నిరసన తెలిపారు.కాంగ్రెస్ తప్పిదాల కారణంగా రాష్ట్ర ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారు. ప్రజా పాలన అని సిఎం ఒక్కరోజు ప్రజలను కలిసి ఆ తరువాత గేట్లు వేపించారు.కాంగ్రెస్ పార్టీ మాటలు కోటలు దాటినాయి..చేతలు మాత్రం గడపదాటడం లేదు. మొన్న ఎన్నికల్లో కాంగ్రెస్ అబద్ధాలు ఊరంతా చుట్టి వచ్చినాయి, మన నిజం మాత్రం గడప కూడ దాటలేదు. చెప్పుకోవడంలో మనం విఫలం చెందినం.కాంగ్రెస్ పార్టీనీ బొంద పెట్టేందుకు ప్రజలు మే 13 కోసం ఎదురు చూస్తున్నారు.మన పార్టీని వీడి ఎంపీ గా పోటీ చేస్తున్న నలుగురు నాయకులు 3వ ప్లేస్‌కి పడిపోయారు.నామా నాగేశ్వరరావు ఉన్న ఒక్క రాజ్యసభ సీటును ఖమ్మం జిల్లా కు ఇవ్వాలని కోరగా, కేసీఆర్ బీసీ బిడ్డ గాయత్రి రవికి ఇచ్చారు. నామ నాగేశ్వరరావును అత్యధిక మెజారిటీతో గెలిపించండి, నామా గెలుపు అభివృద్ధికి మలుపు.

**మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ....**

పార్లమెంట్ ఎన్నికలు తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి మాత్రం మన పార్టీకి ముఖ్యమైన ఎన్నికలు.బీఆర్ఎస్ అభ్యర్థులు మొత్తం అత్యధిక మెజారిటీతో గెలుపొందేందుకు మనం కృషి చేయాలి.తెలంగాణ ప్రజలకు శ్రీరామ రక్ష బీఆర్ఎస్ పార్టీ. కేసీఆర్ కారణంగానే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు వెళ్ళింది. కాంగ్రెస్ పార్టీ పలు పథకాలను రాష్ట్రంలో అమలు చేయకుండా కావాలని ఆపారు.ఏదైనా అడిగితే ఎన్నికల కోడ్ వచ్చిందని అందుకే సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని సాకులు చెప్తున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణ లక్ష్మి పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజల ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి.ఖమ్మం జిల్లా ప్రజలు ఈ ఎన్నికల్లో నామా నాగేశ్వరరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నా.తెలంగాణ గళాన్ని పార్లమెంట్‌లో వినిపించాలి అంటే నామా నాగేశ్వరరావును గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉంది.

**రాజ్యసభ సభ్యులు గాయత్రి రవి మాట్లాడుతూ..**

నామ నాగేశ్వరరావు గెలుపు కోసం మాజీ మంత్రి హరీష్ రావు మన వద్దకు వచ్చారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మన రాష్ట్రాన్ని మనం చాలా అభివృద్ధి చేసుకున్నాం.కేసీఆర్ కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని బస్సు యాత్ర మొదలు పెట్టారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ లో రెండు పిల్లర్లు పాడైతే వాటిని మరమ్మతులు చేయాల్సింది పోయి నీరు మొత్తం సముద్రంలోకి విడిచి పెట్టారు.కాంగ్రెస్ పార్టీ చెప్పిన అబద్ధపు హామీలను ప్రజలు నమ్మి మోసపోయారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని అనవసరంగా గెలిపించామని తల పట్టుకుంటున్నారు.నామ నాగేశ్వరరావును కేసీఆర్ తిరిగి మళ్ళీ లోక్ సభ పక్ష నేతగా నియమించారు.లోక్ సభలో ఏ రోజు బీజేపీ, కాంగ్రెస్ నేతలు రాష్ట్రం తరపున మాట్లాడలేదు.బీఆర్ఎస్ బీజేపీకి ఏ రోజు బీ టీం గా లేదు, అలా ఉంటే కవిత జైల్ లో ఉండేది కాదు.తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతుంది. 2014 లో జిల్లా నుండి ఒక్కరే గెలిచారు, 2018 లో జిల్లా నుండి ఒక్కరే గెలిచారు అయిన కేసీఆర్ ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం అత్యాధిక నిధులు కేటాయించారు.మన పార్టీ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో 8 సీట్లు సాధిస్తుంది అందులో నామా నాగేశ్వరరావు కూడా ఉంటారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ....

మొన్న ఎన్నికల్లో మనం ఊహించని తీర్పును ప్రజలు ఇచ్చారు. మన నాయకుడు కేసీఆర్ బ్రహ్మాండంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి చేస్తూ వెళ్ళారు, కానీ ప్రజలు దానికి భిన్నంగా తీర్పు ఇచ్చారు.ఈ ఎన్నికల్లో మనమంతా కలిసి మెలిసి పని చేద్దాం అలా చేస్తే విజయం మనల్ని వరిస్తుంది.బీఆర్ఎస్ ఎంపీ లు పార్లమెంట్ కు వెళ్ళాల్సిన అవసరం ఉంది. తెలంగాణ రాష్ట్రం కోసం మనకు ఇద్దరే ఎంపీ అభ్యర్థులు ఉంటే వారు పోరాడి మరీ తెలంగాణ సాధించాం.తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత రాష్ట్రాన్ని సీఎంగా కేసీఆర్ దేశంలో ముందంజలో ఉంచారు.మనం అధికారంలో ఉన్నప్పుడు మనం ఇచ్చిన సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వలేదు.17వ లోక్ సభలో 4 బీజేపీ, 3 కాంగ్రెస్, ఒక్కరు ఎంఐఎం ఉండగా తెలంగాణ గురించి పార్లమెంట్ లో ఏ ఒక్కరూ మాట్లాడలేదు.నేను తెలంగాణ రాష్ట్ర ఎంపీ లను పార్లమెంట్‌లో అడిగాను.నీళ్లు లేక రాష్ట్రంలో, జిల్లాలో ఎన్నో పంటలు ఎండి పోయాయి. అదే మన నాయకుడు సీఎంగా ఉండి అంటే అలా జరిగి ఉండేది కాదు.మే 13 వరకు ఇది మన ఎన్నిక అని భావించి అంతా కలిసి పని చేస్తే మనం గెలవడం సునాయాసం అవుతుంది.కాంగ్రెస్ పార్టీ 4 నెలల పాలన గురించి కేసీఆర్ 4 గంటల్లో కడిగి పారేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ నాయకులను ఇబ్బందులకు గురి చేశారు.మన పార్టీకి ఒకే ఒక రాజ్యసభ సీటు అవకాశం ఉంది, ఆ అవకాశాన్ని ఖమ్మం బీసీ బిడ్డకు కేసీఆర్ ఇచ్చారు.అందరం కలిసి పని చేసి మే 13 వరకు కష్టపడాలి.

# రైతు బిడ్డను ఆశీర్వదించండి

## నామ నాగేశ్వరరావు

ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 24, ప్రజా జ్యోతి:

ఖమ్మం జిల్లా రైతు బిడ్డను ..మీ వాడిని..25 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాను.. రెండు సార్లు ఎంపీ గా ఆశీర్వదించి పార్లమెంట్ కు పంపించడంతో పార్లమెంట్ లో జిల్లా ప్రజా వాణి ని గొంతెత్తి వినిపించి, జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశానని బీఆర్ ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి గా నామ బుధవారం నామినేషన్ దాఖలు చేసిన తర్వాత మీడియా పాయింట్ లో మాట్లాడారు. మళ్లీ ఆశీర్వదించి పార్లమెంట్ కు పంపించాలని కోరుతున్నానని తెలిపారు.

రాష్ట్ర విభజన సమస్యలు , ప్రాజెక్టులు, నిధులు, హక్కుల సాధనకు నిరంతరం శ్రమించానని నామ చెప్పారు.విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధి రెడ్డి, జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, సండ్ర వెంకట వీరయ్య, తాటి వెంకటేశ్వర్లు, మదన్ లాల్, మేయర్ నీరజ, పట్టణ అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు



# పిల్లలు చరవాణికి దూరంగా ఉండాలి

## - కొత్త అంశాలను నేర్చుకోవాలి

## -ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రెహానా బేగం

ఖమ్మం, ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి




పిల్లలు చరవాణికి దూరంగా ఉండాలని, కొత్త అంశాలను నేర్చుకోవాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రెహానా బేగం అన్నారు. జన విజ్ఞాన వేదిక, తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో బుధవారం నుండి పిల్లలకు సమ్మర్ క్యాంప్ ను నిర్మల్ హృదయ్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేయటం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రెహానా బేగం పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ... తరగతి గదిలోని నేర్చుకున్న చదువులకు భిన్నంగా సమ్మర్ క్యాంపులో వివిధ అంశాలు నేర్పించడం జరుగుతుందనీ, పిల్లలు చరవాణికి దూరంగా ఉండాలనీ, కొత్త అంశాలను నేర్చుకోవాలని తెలియజేశారు. ఈ సమ్మర్ క్యాంప్ బుధవారం నుండి ఏప్రిల్ 30 వరకు నిర్వహించడం జరుగుతుందని జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు శివన్నారాయణ, ప్రధాన కార్యదర్శి రామారావు, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం కన్వీనర్ ఝాన్సీ తెలియజేశారు. మొదటి రోజు కార్యక్రమంలో భిక్షపతి పిల్లలను సులభంగా డ్రాయింగ్ చేయటంలో మెలుకువలు నేర్పించారు. ఈ కార్యక్రమానికి మోహన్, సునంద, శ్రీరాములు, రాఘవయ్య, లక్ష్మీనారాయణ సదానంద, ప్రవీణ్, బాబూరావు, రామకృష్ణ, మధుసూదన్, నాగేంద్ర, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ సతీష్ ఇంటిపై ఉద్దేశపూర్వకంగా దాడి

## అర్ధరాత్రి విద్యుత్ కనెక్షన్ కట్ చేసి దాడి చేసేందుకు ప్రయత్నం

## పోలీసులు పట్టించుకోకపోవడం శోచనీయం

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 24, ప్రజా జ్యోతి :



ప్రస్తుత సమాజంలో పోలీస్ వ్యవస్థ నిద్ర అవస్థలో ఉండటం ఒక జర్నలిస్ట్ ఇంటిపై పలుమార్లు దాడి జరుగుతుంటే రక్షణ కల్పించలేని పోలీసులు సామాన్య మానవుడికి రక్షణ ఎలా కల్పిస్తారని స్థానిక మండలం ప్రజాప్రతినిధులు ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన బోడ పట్ల సతీష్ ఫోటోగ్రఫీ, రిపోర్టర్ గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు ఇట్టి గ్రామంలో అదే గ్రామానికి చెందిన కొందరు రౌడీ మూకలు సతీష్ ఎదుగుదలను వార్వలేక ఉద్దేశపూర్వకంగా గతంలో సతీష్ కారుపై దాడి చేయగా అప్పటి పోలీసులు నామమాత్రపు కేసులు పెట్టి చేతులు దులుపుకున్నారు. మంగళవారం రాత్రి సుమారు 12 గంటల సమయంలో సతీష్ ఇంట్లో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన కొందరు యువకులు ఇంట్లోకి వచ్చే విద్యుత్తు లైన్ ను కట్ చేసి షార్ట్ సర్క్యూట్ అయ్యేవిధంగా ఆర్థికంగా దెబ్బతీసేందుకు ప్రయత్నించగా సతీష్ ఇంట్లో ఉన్న కంప్యూటర్ పరికరాల్లో హార్డ్ డిస్క్ కాలిపోయింది దానిలో పెళ్లిళ్లకు ఫంక్షన్లకు సంబంధించిన డేటా ఉండటంతో ఆయన మనోవేదన గురయ్యాడు ఆకతాయిలను వెంటనే గుర్తించి వారికి చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే జర్నలిస్టులంతా ఏకమై జిల్లా కమిషనర్ కు కలెక్టర్కు ఫిర్యాదుతోపాటు జర్నలిస్టుల యూనియన్ అంతా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని టివిడబ్ల్యూజెఐజెయు నాయకులు పప్పుల శ్రీనివాస్, మేకల నాగరాజు, కూరపాటి విజయకుమార్, గోవింద సురేష్, ఎల్ ప్రవీణ్ కుమార్, పప్పుల ప్రసాద్, పదముత్తం కనకరాజు హెచ్చరించారు.

# నేడు కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థిగా ఆర్ఆర్ఆర్ నామినేషన్ దాఖలు

## రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 24, ప్రజాజ్యోతి:



కాంగ్రెస్ పార్టీ ఖమ్మం లోక్ సభ అభ్యర్థి రామ సహాయం రఘు రాం రెడ్డి గురువారం ఖమ్మం కలెక్టరేట్ లోని ఏఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు రేణుక చౌదరి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ , ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు తదితరుల సమక్షంలో నామినేషన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్ సందర్భంగా ఉదయం 10 గంటలకు నగరంలోని కాల్వొడ్డు నుంచి ర్యాలీ బయలుదేరి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతుందని పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు.

# 28న టియుడబ్ల్యూజే (ఐజెయు) జిల్లా కార్యవర్గ సమావేశం

ఖమ్మం ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టి యు డబ్ల్యు జె -ఐ జె యు) ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం ఈనెల 28న ఖమ్మం నగరంలో జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు . ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా టి యు డబ్ల్యు జె ( ఐజేయు) రాష్ట్ర అధ్యక్షులు నగునూరి శేఖర్ ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ ఉపాధ్యక్షులు కే రాంనారాయణ హాజరవుతారని వారు చెప్పారు. ఈ సమావేశంలో జూన్ నెలలో ఖమ్మం నగరంలో జరిగే యూనియన్ రాష్ట్ర మహాసభల గురించి చర్చించడం జరుగుతుందని కావున జిల్లా కార్యవర్గ సభ్యులందరూ విధిగా హాజరు కావలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

## అవినీతికి మారుపేరు కాంగ్రెస్

# దేశ అభివృద్ధి మోడీతోనే సాధ్యం

## బిజెపి ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద రావు

ఖమ్మం అర్బన్ ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి:





అవినీతికి మారుపేరు కాంగ్రెస్ పార్టీఅని దేశ అభివృద్ధి మోడీతోనే సాధ్యమని బిజెపి ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద రావు అన్నారు.బుధవారం రఘునాథపాలెం మండలం లో ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిఆర్ఎస్ దేశంలో కాంగ్రెస్ రెండు అవినీతిలో కూరుకుపోయాయని స్కాములకు కాంగ్రెస్ పెట్టింది పేరు అని దుయ్యబట్టారు. బిజెపి నీతివంతమైన పాలన అని ఎలాంటి అవినీతికి తావు ఇవ్వదని మరోసారి మోడీ రావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో మోడీ ప్రభంజనం ఉందని తెలంగాణలో 12 సీట్లు ఖమ్మం తో పాటు గెలవబోతుందని అన్నారు. మూడోసారి మోడీతో కాంగ్రెస్ కనుమరుగు కావడం ఖాయమని ప్రజలు మోడీ పథకాలతో ఆకర్షితులవుతున్నారని బిజెపి బలం దేశంలో పెరిగిందని 400 సీట్లు లభించే విధంగా ప్రజలు సహకరిస్తున్నారు. మోడీ ప్రవేశపెట్టిన ప్రతి పథకం సామాన్యుడికి లబ్ది చేకూర్చిందని ఆ పథకాలే ఖమ్మంలో తనని గెలిపిస్తాయని పేర్కొన్నారు. బిజెపి ముస్లింలకు వ్యతిరేకమని కాంగ్రెస్ టిఆర్ఎస్ లు అసత్య ప్రచారం చేస్తున్నారని కానీ ఇప్పుడు త్రిబుల్ తలాక్ వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో ముస్లిం మహిళలకు బిజెపి అండగా ఉందన్నారు. బిజెపి అందించే ఎన్నో సంక్షేమ పథకాల కారణంగా మహిళలు తమ స్వయం ఉపాధితో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. మండల అధ్యక్షులు పొట్లపల్లి నాగేశ్వరావు, జిల్లా ఉపాధ్యక్షులు గుత్త వెంకటేశ్వర్లు, మండల ఇంచార్జి, జిల్లా ఉపాధ్యక్షరాలు మంద సరస్వతి, అసంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, ఎం ప్రభాకర్ రెడ్డి, జ్వాలా నర్సింహా రావు,మండల ప్రధాన కార్యదర్శి భూక్యా బాలాజీ, హరిలాల్, సాయి, రాంబాబు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి

సజావుగా పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి నామినేషన్ల స్క్రూటీని, బ్యాలెట్ పేపర్ ముద్రణ, హెూం ఓటింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో నూతన కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి ఓటరు తుది జాబితా రూపొందించాలని, ఎన్నికలలో పోటీ చేసే ప్రతి అభ్యర్థికి తుది ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలు అందించాలని, ప్రతి ఓటర్ కు ఓటర్ స్లిప్పు పంపిణీ కోసం నిర్దేశిత షెడ్యూల్ రూపొందించి బూత్ స్థాయి అధికారుల ద్వారా ప్రతి ఓటర్ కు ఓటర్ స్లిప్పు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, వేసవి కాలంలో పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో ఓటింగ్ లైన్ల వద్ద నీడ కల్పించేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు త్రాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని, జిల్లాలో వెబ్ క్యాస్టింగ్ చేస్తున్న పోలింగ్ కేంద్రాల వివరాలు సమర్పించాలని, మిగిలిన పోలింగ్ కేంద్రాల బయట సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ చివరి రోజు అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రిటర్నింగ్ అధికారుల కార్యాలయం వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆర్.ఓ. కార్యాలయం బయట, లోపల గడియారం ఏర్పాటు చేయాలని, ఏప్రిల్ 25 మధ్యాహ్నం 3 గంటల లోపు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చిన ప్రతి అభ్యర్థికి నామినేషన్ వేసే అవకాశం కల్పించాలని అన్నారు. ఏప్రిల్ 26న నామినేషన్ల స్క్రూటీని ప్రక్రియ భారత ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పక్కాగా నిర్వహించాలని అన్నారు. ఖచ్చితమైన కారణాలు ఉంటే మాత్రమే నామినేషన్ తిరస్కరణ చేయాలని అన్నారు. నామినేషన్ స్క్రుటిని ప్రక్రియ ముగిసిన తర్వాత ఆమోదించిన నామినేషన్ వివరాలు హార్డ్, సాఫ్ట్ కాపీలు సమర్పించాలని అన్నారు. ఏప్రిల్ 29 నామినేషన్ ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పోటిలో ఉన్న అభ్యర్థుల వివరాలను హార్డ్, సాఫ్ట్ కాపీలు సమర్పించాలని అన్నారు. పోటిలో ఉన్న స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు.




పోస్టల్ బ్యాలెట్ పేపర్ల ముద్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈవిఎం యంత్రాలపై బ్యాలెట్ పత్రాల కమీషనింగ్ కు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫారం 12డీ కింద ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించు కునేందుకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించు కునేందుకు దరఖాస్తు చేసుకున్న అత్యవసర విధుల నిర్వహణ వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని అన్నారు. ఇంటి వద్ద నుంచి దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల ఓట్ల స్వీకరణకు అవసరమైన మేర బృందాలను ఏర్పాటు చేయాలని, పక్కా షెడ్యూల్ రుపోందించి ఆ సమాచారం దరఖాస్తుదారులకు అందించాలని అన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓట్ల నమోదుకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్ సిద్దం చేయాలని అన్నారు. మే 13న పకడ్బందీగా పోలింగ్ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ విధులలో పాల్గొనే సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని, అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మే 13న ఉదయం మాక్ పోల్ నిర్వహించాలని, ప్రతి రెండు గంటలకు పోలింగ్ వివరాలను ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని, పోలింగ్ ప్రక్రియలో ఈవీఎం యంత్రాలు ఇబ్బందులకు గురైతే వెంటనే రిజర్వ్ ఈవిఎం యంత్రాలను సెక్టార్ అధికారులు మార్చే విధంగా సన్నద్ధంగా ఉండాలని అన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత ప్రతి పోలింగ్ కేంద్రం నుంచి అవసరమైన నివేదికలు పకడ్బందీగా నమోదుచేసి అందించేలా జాగ్రత్తలు వహించాలని, పోలింగ్ శాతంపై అందించే నివేదికలు పక్కాగా ఉండాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారం అందేలా చూడాలని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్క సిబ్బందికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు అందించాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, అధికారులతో మాట్లాడుతూ, ఓటర్ల తుది జాబితా రూపొందించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారికి అందించాలని అన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణి పకడ్బందిగా జరిగేలా చూడాలని అన్నారు. పోలింగ్ సిబ్బంది రెండవ ర్యాండమేషన్ ప్రక్రియ సకాలంలో జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చూడాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, డిఆర్డీఓ సన్యాసయ్య, జెడ్పి సిఇఓ వినోద్, సిపిఓ శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, జిల్లా ఉపాధికల్పన అధికారి కె. శ్రీరామ్, కలెక్టరేట్ ఏవో అరుణ, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, ఎన్ఐసి కోఆర్డినేటర్ రాంప్రసాద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరవ రోజు 14 నామినేషన్లు జిల్లా కలెక్టర్

ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి.




లోకసభ సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గంలో బుధవారం ఆరో రోజున (14) నామినేషన్లు స్వీకరించినట్లు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. 17-ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ బిజెపి అభ్యర్థి గా తాండ్ర వినోద్ రావు, తన నాల్గో సెట్, బిఆర్ఎస్ పార్టీ నుండి నామా నాగేశ్వరరావు 3 సెట్లు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుండి రాయల నాగేశ్వరరావు తరపున రెండు జట్లు, సకల జనుల పార్టీ తరపున పాపిట్ల రామ్మూర్తి ఒక సెట్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుండి పోట్ల నాగేశ్వరరావు 3 సెట్లు, బీఎస్పి నుండి ఎర్ర కామేశ్వర రావు ఒక సెట్, జై భీమ్ రావు భారత్ పార్టీ నుండి కొప్పుల శ్రీనివాస్ రెండు సెట్లు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుండి నాగ సీతారాములు తరపున ఒక సెట్, ఆల్ ఇండియా నేషనల్ రక్ష సేన పార్టీ నుండి లకావత్ నాగేశ్వరరావు ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థులుగా లింగాల రవికుమార్ ఒక సెట్, వాసం రామకృష్ణ ఒక సెట్, ఎస్కె. అజ్జులు రెండు సెట్లు, సోమగాని నరేందర్ ఒక సెట్, లింగం కృష్ణ ఒక సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ను కలిసి

# వినతిపత్రం అందించిన కాంగ్రెస్ కార్యకర్తలు

ఖమ్మం ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి :

ఖమ్మం కాంగ్రెస్ పార్లమెంట్ సీటుపై ఇంకా స్పష్టత రాకపోవడంతో ఆపార్టీ నాయకులు కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నామినేషన్‌కు గడువు ఇంకా రెండు రోజులు మాత్రమే ఉండగా ఇంతవరకు అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఖమ్మం పార్లమెంట్ స్థానానికి అభ్యర్థులు గా ఇతర జిల్లాలకు చెందిన వారి పేర్లు వినిపిస్తున్నాయి. దీంతో ఖమ్మం జిల్లాకు చెందిన వారికే టిక్కెట్ కేటాయించేలా చూడాలని కాంగ్రెస్ కార్యకర్తలు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడికి వినతిపత్రం అందజేశారు.



పార్టీని పటిష్టపరిచేందుకు ఏళ్ల తరబడి కృషి చేసిన వారికి పార్లమెంట్ టిక్కెట్ వచ్చేలా చూడాలని వారు కోరారు.